ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శుక్రవారం 5 డిసెంబరు 2025





ఆమెదే తీర్పు..

- పంచాయతీల్లో మహిళా ఓటర్లే కీలకం
- జిల్లాలో గెలుపోటములపై ప్రభావం..
- పురుషుల కంటే మహిళలే అధికం
- స్వశక్తి సంఘాలపైనే అభ్యర్థుల దృష్టి
- పల్లెల్లో స్వశక్తి మహిళలు 108025 మంది

జిల్లాలో గ్రామపంచాయతీ ఓటర్లు..

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
బోయినపల్లి	14753	15752	30505
చందుర్తి	13445	14649	28094
ఇల్లంతకుంట	19644	20902	40546
గంభీరావుపేట	17811	18996	36807
కోనరావుపేట	17180	18045	35225
ముస్తాబాద్	18658	19842	38500
రుద్రంగి	6454	7208	13665
తంగళ్లపల్లి	19395	20683	40079
వీర్నపల్లి	5769	5958	11727
వేములవాడ	8953	9523	18492
వేములవాడ రూరల్	9020	9805	18825
ఎల్లారెడ్డిపేట	19690	21196	40886
మొత్తం	170772	182559	353351
	(20 మంది ట్రాన్స్‌జెండర్)		

జిల్లాలో స్వశక్తి సంఘాల సభ్యులు..


మండలం	సంఘాలు	సభ్యులు
బోయినపల్లి	834	9160
చందుర్తి	807	8270
ఇల్లంతకుంట	1152	12142
గంభీరావుపేట	1208	12083
కోనరావుపేట	1088	11421
ముస్తాబాద్	1244	12997
రుద్రంగి	396	4304
తంగళ్లపల్లి	1152	11338
వీర్నపల్లి	363	3960
వేములవాడ	464	4565
వేములవాడ రూరల్	532	5657
ఎల్లారెడ్డిపేట	1210	12128
మొత్తం	10450	108025

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయాలు రంజుగా మారుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల తీర్పే గెలుపోటములపై ప్రభావం చూపనుంది. జిల్లాలో మూడు విడతల్లో జరిగే ఎన్నికల్లో తొలి విడత నామినేషన్ల ఘట్టం ముగిసి బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచార బాట పట్టారు. రెండో విడతలో ఉపసంహరణలు కొనసాగుతున్నాయి. మూడో విడతలో నామినేషన్లు శుక్రవారంతో ముగుస్తాయి. బరిలో ఎవరు నిలిచిన మహిళా ఓటర్లు కీలకంగా ఉండడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకంటే అభ్యర్థులు వ్యక్తిగతంగా మహిళలను ఆకట్టుకునే విధంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీల ప్రభావంకంటే అభ్యర్థుల వ్యక్తిగత ఇమేజ్ ప్రభావమే ఎక్కువగా ఉండడంతో మహిళా ఓట్లు ఎవరు కైవసం చేసుకుంటారని చర్చ కూడా గ్రామాల్లో ఉంది. మరోవైపు మహిళా రిజర్వు స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లో కూడా మహిళా అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

జిల్లాలో అత్యధికం మహిళా ఓటర్లే..

జిల్లా పంచాయతీ ఎన్నికల్లో 12 మండలాలు, 260 గ్రామపంచాయతీల్లో 3 లక్షల 53 వేల 351 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1701772 మంది, మహిళలు 182559 మంది ఉన్నారు. వీళ్లలో అధికంగా 11787 మంది మహిళలు పురుషులకంటే ఎక్కువగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 260 సర్పంచ్, 2268 వార్డులు ఉండగా ఇందులో కొన్ని గ్రామపంచాయతీలో ఏకగ్రీవ ప్రయత్నాలు ఫలించాయి. మొదటి విడతలో 85 సర్పంచుల్లో 9 మంది ఏకగ్రీవం కాగా, 76 సర్పంచ్ స్థానాల్లో 229 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వార్డుల్లో 229 ఏకగ్రీవం కాగా, 519 వార్డుల్లో 1377 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెండో విడత నామినేషన్ల ఉపసంహరణలు కొనసాగుతున్నాయి. ఇందులో 88 సర్పంచ్ స్థానాల్లో ఐదు ఏకగ్రీవం కాగా, 758 వార్డులో 180 ఏకగ్రీవం కాగా, మిగిలిన 578 వార్డుల్లో 1677 మంది పోటీలో ఉన్నారు. మూడో విడత నామినేషన్ల పర్వం శుక్రవారం ముగుస్తుంది. ఒకవైపు ఎన్నికల బరిలో ప్రత్యర్థులను బుజ్జగిస్తూ పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తూనే మహిళా ఓట్లను రాబట్టుకునే ప్రయత్నాల్లో స్వశక్తి సంఘాల లీడర్లతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. జిల్లాలో 411 గామైక్య సంఘాలు ఉండగా, స్వశక్తి సంఘాలు 10450 ఉన్నాయి. ఆయా సంఘాల్లో 108025 మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘాల నుంచి గంపగుత్తగా ఓట్లు రాబట్టుకోవాలని ప్రయత్నాలను అభ్యర్థులు ముమ్మరం చేశారు.



మహిళలకు దక్కని పూర్తి రిజర్వేషన్లు రిజర్వేషన్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు పూర్తి స్థాయిలో రిజర్వే షన్లు దక్కలేదు. 50 శాతం మహిళలకు రిజర్వు కావలసి ఉండగా, 260 సర్పంచ్ స్థానాల్లో 46.76శాతం సీట్లు, 2268 వార్డులో 40.38 శాతం సీట్లు కేటాయించారు. గతంలో కంటే రిజర్వేషన్లు తగ్గిపోవడంతో మహిళల్లోనూ అసంతృప్తి వ్యక్తం అవుతోంది. మహిళలు జనరల్ స్థానాల్లో సైతం పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచ్ స్థానాల్లో 119 స్థానాలు, 916 వార్డు స్థానాలు మహిళలకు కేటాయిం చారు. సర్పంచ్ స్థానాల్లో 56 బీసీలకు రిజర్వ్ చేశారు. ఇందులో మహిళకు 24 స్థానాలు, జనరల్‌గా 32 స్థానాలు ఉన్నాయి. వంద శాతం ఎస్టీ పంచాయతీలు 26 ఉండగా, 11 మహిళలకు, 15జనరల్‌కు కేటాయించారు. మిగతా నాలుగు ఎస్టీ స్థానాల్లో రెండు మహిళలు, రెండు జనరల్‌గా ఉన్నాయి. ఎస్సీలకు 53 స్థానాలు కేటాయించగా 24 మహిళలకు, 29 జనరల్‌గా ఉన్నాయి. జనరల్ స్థానాలు 121ఉండగా 58 మహిళకు, మిగతా 8లో..

జిల్లాలో మహిళలకు కేటాయించిన సర్పంచ్ స్థానాలు

మండలం	మొత్తం	ఎస్టీలు	ఎస్సీ	బీసీ	జనరల్
బోయినపల్లి	23	–	03	02	06
చందుర్తి	19	–	02	02	04
ఇల్లంతకుంట	35	–	04	04	09
గంభీరావుపేట	22	01	02	02	05
కోనరావుపేట	28	02	02	03	06
ముస్తాబాద్	22	–	02	02	05
రుద్రంగి	10	04	--	–	–
తంగళ్లపల్లి	30	–	03	04	07
వీర్నపల్లి	17	04	01	–	03
వేములవాడ	11	–	01	01	03
వేములవాడరూరల్	17	–	02	02	04
ఎల్లారెడ్డిపేట	26	02	02	02	06
మొత్తం	260	13	24	24	58

జిల్లాలో మహిళలకు కేటాయించిన వార్డు స్థానాలు

మండలం	మొత్తం	ఎస్టీ	ఎస్సీ	బీసీ	జనరల్
బోయినపల్లి	212	–	23	20	49
చందుర్తి	174	04	15	21	37
ఇల్లంతకుంట	294	–	24	34	64
గంభీరావుపేట	202	10	15	23	41
కోనరావుపేట	238	14	19	23	46
ముస్తాబాద్	202	04	16	18	45
రుద్రంగి	86	29	01	04	07
తంగళ్లపల్లి	252	–	18	30	57
వీర్నపల్లి	132	31	06	03	20
వేములవాడ	104	–	10	11	24
వేములవాడరూరల్	146	–	13	14	32
ఎల్లారెడ్డిపేట	226	14	16	21	47
మొత్తం	2268	106	117	222	471

కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం 7

నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం 8

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

సిరిసిల్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాం దాస్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలపై వివరాల సేకరణ



వివరాలు తెలుసుకుంటున్న వ్యయపరిశీలకుడు రాజ్‌కుమార్

ఇల్లంతకుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి)៖ గ్రామపంచాయతీ ఎన్నికల వివరాలను ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకుడు రాజ్‌కుమార్ సేకరించారు. మండలపరిషత్ కార్యాలయాన్ని గురువారం పరిశీలించారు. ఎన్నికలల ఎంత మంది అభ్యర్థులు పోటీచేస్తున్నారు, వారు ఎన్నికలలో పెట్టే ఖర్చును నిశితంగా గమనించాలని సూచించారు. కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే ఖర్చులు పెట్టేలా అభ్యర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు నవీన్‌కుమార్, భారతి, ఎంపీడీఓ శశికళలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు రవికుమార్



గొల్లపల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు రవికుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, గొల్లపల్లి గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలను తెలుసుకున్నారు. గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల ప్రకటన, తదితర ప్రక్రియలో పొరపాట్లు చోటుచేసుకుండా చూడాలన్నారు. నామినేషన్ల వివరాలను రోజు వారిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు రవికుమార్ అన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సత్తయ్య ఉన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవికుమార్ పరిశీలించారు.చెక్‌పోస్ట్ వద్ద ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో సుధాకర్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న కమిషనర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం సీనారే కళా మందిరంలో గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో సెప్టిక్ ట్యాంక్ కార్మికులు, పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్మికులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కార్మికులకు సీజనల్ వ్యాధులు నివారణ, వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖాదీర్‌పాషా మాట్లాడారు. ఫీల్డ్ డ్యూటీలో పనిచేస్తే కార్మికులు నియమిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమన్నారు. పనిలో భద్రతా పరికరాలు తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. కార్మికుల ఆరోగ్య రక్షణ మున్సిపాలిటీకి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమానికి దోహదపడే విధంగా మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, మున్సిపల్ సిబ్బంది, అన్ని విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

రుద్రంగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం సర్పంచ్ తండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వేములవాడ మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన పందిల్ల రాజు(52) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. బంధువు మృతిచెందడంతో దహన కార్యక్రమాలకు వెళ్లిన రాజుకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మండల పరిషత్ సిబ్బంది, గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీకుముదిని



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు

సిరిసిల్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ రాణీకుముదిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గరిమ అగ్రవాల్, జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవికుమార్‌తో కలిసి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు, ఏకగ్రీవ స్థానాలలో ఉప సర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు, నామినేషన్లపై వచ్చే ఫిర్యాదులు, తదితర అంశాలపై ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణీ కుముదిని మాట్లాడుతూ వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలలో ఉప సర్పంచ్ నియామకం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున సంబంధిత రిపోర్టులు టి- పోల్‌లో పెండింగ్ లేకుండా నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి వచ్చిన నామినేషన్లలో చెల్లుబాటు నామినేషన్ వివరాలు నవీకరించాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పనిసరిగా సౌకర్యం కల్పించాలని, ప్రతి మండలంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ నిబంధనల ప్రకారం ముద్రించాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎటువంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యంగా మారుతుందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీలలో అక్రమంగా నగదు, మద్యం, ఆభరణాలను ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలించే పక్షంలో నిబంధనల ప్రకారం సీజ్ చేయాలని, పోలింగ్ రోజు సరిహద్దు ప్రాంతాల్లో అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సీజన్ నడుస్తున్నందున రైతుల వద్ద నుంచి ఆధారాలు పరిశీలించాలని, పంట డబ్బులకు ఆధారాలు ఉంటే సీజ్ చేయవద్దని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీపీవో షరీఫుద్దిన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

సిరిసిల్ల టౌన్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అధ్యాపకురాలును కళాశాల నుంచి తొలగించడంపై నిరసన తెలిపిన ఏబీవీపీ నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థిని దండించిందని బంధువులు ఆందోళనకు దిగడంతో యాజమాన్యం బుధవారం అధ్యాపకురాలను తొలగించారు. ఈ విషయమై ఏబీవీపీ నాయకులు కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 సంవత్సరాలు కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలును మహిళ అని కూడా చూడకుండా ఏకపక్షంగా ఎవరి ఒత్తిళ్లకు లొంగి తొలగించారంటూ నిరసన తెలిపారు. అధ్యాపకురాలును వెంటనే విధులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఏబీవీపీ నాయకులు అదుపులోకి తీసుకొని అనంతరం వదిలేశారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

వేములవాడ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం అనుపురంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు.

● బోయినపల్లి : బోయినపల్లి మండలం మానువాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత నామినేషన్ల జోరు..

- రెండో రోజు 171 సర్పంచ్, 628 వార్డులకు..

- నేటితో ముగియనున్న గడువు

సిరిసిల్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డ అభ్యర్థులు మూడో విడతలో రెండోరోజు నామినేషన్ల జోరును కొనసాగింది. నాలుగు మండలాల్లో 87 సర్పంచులు, 762వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గురువారం రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 171 నామినేషన్లు, 628వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వచ్చాయి. ఇప్పటివరకు సర్పంచ్ స్థానాలకు 318 నామినేషన్లు, 628 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వచ్చాయి. శుక్రవారం నామినేషన్లు ప్రక్రియ ముగియనుంది. ఉపసంహరణలకు 9వ తేది వరకు గడువు ఉంది.

తుది విడతలో రెండో రోజు నామినేషన్లు

మండలం	సర్పంచ్	వార్డులు
ఎల్లారెడ్డిపేట	47	191
వీర్నపల్లి	33	41
ముస్తాబాద్	45	185
గంభీరావుపేట	46	211
మొత్తం	171	628

నీవెంటే నేను..

● మొదట భార్య.. తర్వాత భర్త

● 24 గంటల వ్యవధిలో

వృద్ధ దంపతుల మృతి

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధదంపతులు 24గంటల వ్యవధిలోనే మృతిచెందిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికిచెందిన కనకం రాజమల్లు(80), రాజవ్వ(73) అనేవృద్ధదంపతులు కొంత కాలంగా వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధ వారం భార్య రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందగా, భర్త రాజమల్లు గురువారం మృతిచెందాడు. 24గంటల వ్యవధిలోనే భార్యభర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో ప్రమాదం

● ఇద్దరు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2ఏ ఇంక్లైన్‌లో గురువారం రెండో షిఫ్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. మ్యాన్‌రైడింగ్ చానల్స్‌కు మరమ్మతులు నిర్వహిస్తుండగా చక్రాలు ఊడిపోయి సునీంద్ర, మహేందర్‌రెడ్డి అనే జనరల్ అసిస్టెంట్ల చేతులపై పడడంతో చేతులకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే వారిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన మహేందర్‌రెడ్డిని అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు. ప్రమాదంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.


ఎస్సైపై మానవ హక్కుల కమిషన్ విచారణ

మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపాదకాలనీలో కేసు విచారణ పేరిట జరిగిన అవమానభారంతో శీలం రాజ్‌కుమార్ అనేయువకుడు ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మంథని ఎస్‌ఐపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గురువారం విచారణ జరిపినట్లు హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ తెలిపారు. శీలం రాజ్‌కుమార్ మృతిపై, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్రమానవ హక్కుల కమిషన్‌లో ప్రజాప్రయోజనార్థం మేరకు ఫిర్యాదుచేయగా కమిషన్ ఆదేశాల మేరకు ఎస్సై రమేష్ వ్యక్తిగతంగా హాజరు కాగా విచారణ అనంతరం కేసును జనవరి 8కి వాయిదా వేసినట్లు తెలిపారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలకేంద్రంలో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో అనుమతులు లేకుండా నడుస్తున్న లారీ, ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేసినట్లు ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు ఉంటేనే రోడ్లపైకి రావాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనబీమా చేయించాలన్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను రవాణా రంగానికి వినియోగించవద్దని సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుల్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరం రాయండి.. బహుమతి పొందండి



● రెండు విభాగాల్లో పోటీలు

● ఈ నెల 8 వరకు ఉత్తరాలు పంపేందుకు గడువు

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికత పరుగులు పెడుతున్న ప్రస్తుత తరుణంలో కనుమరుగవుతున్న పాత సంప్రదాయాలను మళ్లీ గుర్తు చేసేందుకు తపాల శాఖ సంకల్పించింది. బంధువులకు, మిత్రులకు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు ఏదైనా సమాచారం చేరవేయాలంటే ఉత్తరాలు రాసే వారు. ఇది 25 ఏళ్ల క్రితం నాటి ముచ్చట. గతంలో ఉత్తరాలు రాయడం కోసం పోస్ట్ కార్డు, ఇన్‌లాండ్ లెటర్, కవర్ ఉపయోగించే వారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో సమాచారం అందించేందుకు క్షణ కాలం కూడా పట్టడం లేదు. దీంతో కొన్ని ప్రభుత్వ సంస్థలు మాత్రమే తపాలా శాఖ సేవలను వినియోగిస్తుంది. దీని కోసం తిరిగి ఉత్తరాలు రాయడాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో డాయీ ఆఖర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు లెటర్ టు మై రోల్ మోడల్ అంశంపై పోటీ నిర్వహిస్తోంది. ఈ అంశంపై వ్యాసాలు రాసి పంపాలని, ఈనెల 8వ తేదీ వరకు ఉత్తరాలను పంపించాలని కోరుతోంది.

ఎవరు, ఎలా రాయాలి..

తపాల శాఖ ఉత్తరాలు రాసే పోటీని రెండు విభాగాలు విభజించారు. 18 ఏళ్లలోపు విభాగం, 18 ఏళ్ల దాటిన వారు వ్యాసాలు రాసి పంపాల్సి ఉంటుంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రాయవచ్చు. ఇన్‌లాండ్ లెటర్‌లో వ్యాసం రాసే వారు 500 పదాలకు మించకుండా, కవర్‌లో రాసే వారు 1000 పదాలకు మించకుండా ఏ4 సైజ్ పేపర్‌లో చేతి రాతతో రాసి పంపాలి. టైప్ చేసి పంపితే అంగీకరించరు. వ్యాసంతో పాటు అభ్యర్థులు తమ వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

తపాల సర్కిల్లో ఉత్తరాలు రాయడంలో విజేతలుగా నిలిచే వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందిస్తారు. జాతీయ విభాగంలో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ. 10 వేలుపంపిణీ చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
సయ్యద్ అజారోద్దీన్, పోస్టల్ అధికారి, మంథని

ఉత్తరాల ద్వారా వ్యాసాలు రాసే పోటీని నిర్వహిస్తూ తపాలా శాఖ వారు బహుమతులు అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తమ లేఖలను ద చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, డాక్ సదన్, అబిడ్స్ హైదరాబాద్ 500001 చిరునామాకు ఈనెల 8వ తేదీలోగా పంపించాలి.

వైన్స్ ఏర్పాటు చేయవద్దని మహిళల రాస్తారోకో

● గ్రామ కార్యదర్శిని నిలదీసిన కాలనీవాసులు



రాస్తారోకో చేస్తున్న మహిళలు

కోరుట్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలనీలో వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దని మండలంలోని అయిలాపూర్ గ్రామ మహిళలు ఆందోళనకు దిగారు. వైన్స్‌కోసం షెడ్ నిర్మాణానికి ఎలా అనుమతిని ఇచ్చావని గ్రామకార్యదర్శిని నిలదీశారు. గురువారం మండలంలోని కోరుట్ల అయిలాపూర్ రోడ్డుపై అక్కడి కాలనీవాసులు ఆందోళనకు దిగి రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం మద్యం టెండర్లు నిర్వహించగా స్థానికంగా ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి చెందిన వైన్స్ వ్యాపారులకు డ్రా ద్వారా దక్కించుకున్నారు. దీంతో వ్యాపారి అయిలాపూర్ నుంచి కోరుట్లకు వచ్చే రహదారిని ఆనుకోని ఉన్న ఓ స్థలంను లీజ్‌కు తీసుకోని షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీకి చెందిన మహిళలు వైన్స్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. వైన్స్ ఏర్పాటుచేస్తే కాలనీలో ఉన్న మహిళలు ఇబ్బందులుఎదుర్కొంటారని వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దన్నారు. దీంతో కార్యదర్శి నవీన్ ఎక్సైజ్‌అధికారుల దృష్టికిసమస్యను తీసుకపోయి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. కాగా అయిలాపూర్ వైన్స్ గెజిట్‌లో లేదని ప్రచారం జరగుతోంది. అక్కడ ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి మార్చినట్లుగా సమాచారం.

అనుమతి లేని షెడ్.. ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్ హాల్ సీజ్

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ అధికారులు అనుమతి లేని షెడ్‌తో పాటు ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్‌హాల్‌ను సీజ్‌చేశారు. గురువారం పటణంలోని నందిచౌరస్తా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన షెడ్‌కు నిర్మాణ అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో మెట్‌పల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ రూ.14లక్షలు పెండింగ్‌లో ఉండగా సీజ్‌చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జీపీవో సస్పెన్షన్.. కేసు నమోదు

● రికార్డులో భూవిస్తీర్ణం పెంచి.. మరొకరి పేరు చేర్చిన వైనం

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూరికార్డులో భూవిస్తీర్ణం పెంచి, మరొకరి పేరు చేర్చి అక్రమంగా భూపట్టా చేసిన మండలంలోని బల్వంతాపూర్ జీపీవో ఈ ప్రవీణ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తాటిపల్లికి చెంది ధర్మవ్వకు చెందిన సర్వేనంబర్ 290/9లో అయిదు ఎకరాల భూమి ఉండగా భూమి పహానిలో భూవిస్తీర్ణం మరో 2.20ఎకరాలకు పెంచి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి జీపీవోపై సస్పెన్షన్ వేటువేశారు. ధర్మవ్వ పహానీల కోసం దరఖాస్తు చేసుకోగా పెంచిన భూవిస్తీర్ణంను 2.20ఎకరాలను జవ్వాజి జలజ పేరిట నమోదు చేసినట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు.

విచారణ జరిపిన అధికారులు ప్రభుత్వ రికార్డులు, పహానీలను ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో తహసీల్దార్ వసంత ఫిర్యాదు మేరకు జీపీవో ప్రవీణ్, జలజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

తల్లిదండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజుల జైలు

జగిత్యాల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జేఎఫ్‌సియం కోర్టు న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ తీర్పు చెప్పారు. జగిత్యాల పట్టణం గంజ్ స్ట్రీట్‌కు చెందిన వయోవృద్ధులైన మండలోజు సత్యవతితోపాటు ఆమెభర్త బాగోగులు చూసుకోకుండా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయమని తన కొడుకు రమేష్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని 2021లో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కిషోర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ కరుణాకర్ సూచనల మేరకు హెడ్ కానిస్టేబుల్ ఏ రాజేశ్వరరావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ బి. రాజేష్ బాధితురాలు తరుపున వాదించారు. సాక్ష్యాలు పరిశీలించి, విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ నిందితుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కొండలరాయుడి కోటపై నుంచి దూకిన యువకుడు

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపైన గల కొండలరాయుడి కోటనుంచి మతిస్థిమితంలేని వ్యక్తి దూకగా తీవ్రగాయాలతో బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మద్దునూరు మండలం జాలపల్లికి చెందిన యాసవేణి ధీరజ్ అనే యువకుడు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబసభ్యులు వారంరోజుల క్రితం కొండగట్టు అంజనేయస్వామి సన్నిధికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొండపైన ఉంటున్న మతిస్థిమితం సరిగాలేని ధీరజ్ గురువారం ఆలయం వెనకాల గల కొండలరాయుడి కోట బండరాళ్ల వద్దకు వెళ్లి లోయలోకి దూకాడు. గమనించిన అక్కడున్న కొందరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డులు రాజేశ్, వెంకటేశ్, సెక్యూరిటీ గార్డు కుమార్ కొంతమంది భక్తులు కలిసి అతన్ని లోయ నుంచి బయటకు తీసుకువచ్చారు. ధీరజ్‌కు వెనుక వైపులో గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కొంగుకు నిప్పంటుకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వాసాల పద్మ(85) అనే వృద్ధురాలి చీరకొంగుకు నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న తన కూతురు వకుల ఇంటికి వచ్చిన పద్మ చలికాలం ఎండ కోసం గ్యాలరీ పక్కన ఉన్న కుర్చీలో కూర్చొంది. పక్కన తులసిచెట్టు వద్ద దీపం వెలిగించి ఉండగా ప్రమాదవశాత్తూ వృద్ధురాలి చీర కొంగు దీపంపై పడి మంట అంటుకుంది. ఘటనలో పద్మ తీవ్ర గాయాల పాలు కాగా కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

తండాలో పోలీసుల సోదాలు

● 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..

● 10 లీటర్ల సారా స్వాధీనం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో సోదాలు జరిపారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వచేసిన 80లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 10 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులు నేమీ, కవితపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

మానకొండూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లిలో తాగునీటి పైపు లైన్ కోసం రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చివేయాలని కాలనీ వాసులు, వాహనదారులు కోరుతున్నారు. గంగిపల్లి ఎస్సీకాలనీ, కొండపల్కలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పైప్‌లైన్ నిర్మాణం కోసం గుంత తవ్వి వదిలేశారు. సింగిల్ తారు రోడ్డు కావడంతో పెద్ద వాహనం వెళ్లే సమయంలో స్థలం సరిపోక ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, గుంత పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని కోరారు.



గంగిపల్లిలో రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గుంత

రానున్న వేసవికి పటిష్ట కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

అధికారులతో సమీక్షలో ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ అధికారులకు సూపరింటెండింగ్ ఇంజనీర్ కరీంనగర్ మేక రమేష్‌బాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధంగాఉండాలని ఏఈలకు, ఏడీలకు సూచించారు. ఎక్కడైతే పవర్ ట్రాన్స్ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఓవర్‌లోడ్ అయ్యే అవకాశం ఉందో అక్కడ అదనపు సామర్థ్యం పెంపుదల ట్రాన్స్ఫార్మర్ పెట్టాలని ఆదేశించారు. 33కేవీ, 11కేవీ లైన్లు ఓవర్ లోడ్ అయ్యే అవకాశం ఉన్నచోట కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వినియోదారులకు అంతరాయం లేకుండా 33కేవీ, 11కేవీ మెయింటెనెన్స్ చేయాలన్నారు. వ్యవసాయ సర్వీస్ అప్లికేషన్లు 15 రోజుల్లోపు సర్వీస్ కనెక్షన్ ఇవ్వాలని, గృహ, వాణిజ్య మీటర్లు ఏడు రోజుల్లోపు రిలీజ్ కావాలని ఆదేశించారు. 1912ఫోన్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పొలంబాట, పల్లెబాట, బస్తీబాట, పట్టణబాట నిర్వహించి వినియోదారులకు అవగాహన సదస్సు నిర్వహించి విద్యుత్‌ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు కే ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి, ఎం తిరుపతి, ఎస్ఏవో రాజేంద్ర ప్రసాద్, ఏవోలు, ఏఏవోలు, ఏడీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మేక రమేష్‌బాబు

ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు వివిధ కారణాలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే..

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



రజనీకాంత్(ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికిచెందిన జక్కె రజనీకాంత్(31) అనేవ్యక్తి కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది బిజిగిరి షరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో మద్యానికి బానిసై ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన సద్ది రాజిరెడ్డి(40) భార్య కొన్నేళ్లక్రితం చనిపోయింది. రాజిరెడ్డి డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా పనిలేకపోవడంతో మద్యానికి బానిసైన రాజిరెడ్డి ఒంటరితనంతో మనస్థాపంచెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడితల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకున్న యువకుడు



అరవింద్(ఫైల్)

పెగడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్(23) అనేయువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు ఏదైనా పనిచేసుకుని బతకాలని సూచించగా మనస్థాపంతో ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా రాత్రి చనిపోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



అంజవ్వ(ఫైల్)

చందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో జరిగింది. గ్రామస్థుల, చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన నేదూరి అంజవ్వ(55) అనే మహిళకు భర్త పోశయ్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం హార్వెస్టర్ కొనుగోలు చేయగా ఆర్థికంగా నష్టపోయారు. హార్వెస్టర్ విక్రయించిన అప్పులు తీరలేదు. వ్యవసాయంలో వచ్చిన నష్టంతో పూర్తిగా దివాళా తీశారు. దీంతో అప్పులిచ్చినవారు చెల్లించాలని కోరారు. ముగ్గురుకుమారులు పట్టించుకోకపోవడంతో తీవ్రమనస్థాపానికి లోనైనా అంజవ్వ ఇంట్లో ఉరివేసుకుంది. భర్త పోశయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం



జితేందర్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాన్ని దున్నేందుకు గురువారం కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ వెనుక నాగళ్లపై వేసుకుని వెళ్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం జితేందర్(36) దుర్మరణం పాలయ్యాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. జితేందర్ గ్రామానికి చెందిన శ్రీను అనేవ్యక్తి ట్రాక్టర్‌ను నడుపుతూ జీవిస్తున్నాడు. పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్ వెనుకఉన్న నాగళ్లపై కేజీవీల్స్ వేసుకుని వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కేజీవీల్స్ ఎగిరి కిందిపడ్డాయి. దీంతో జితేందర్ వాహనం వెనుక వైపునకు చూడడం వల్ల ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో బోల్తాపడింది. చుట్టుపక్కల రైతులు గమనించి ట్రాక్టర్ కింద చిక్కుకున్న ఆయను తీసేందుకు యత్నించారు. మరోట్రాక్టర్ సహాయంతో బోల్తాపడిన వాహనాన్ని తొలగించారు. అప్పటికే జితేందర్ చనిపోయాడు. మృతుడికిభార్య దివ్య, కొడుకు విశాల్, తల్లి లక్ష్మి ఉన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వెల్గటూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామశివారులో ఈనెల29న రోడ్డుప్రమాదంలో గాయపడిన లక్ష్మణ్‌రావు (36) అనేయువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. ఈనెల29న రాత్రి సమయంలో ముత్తునూర్ గ్రామానికిచెందిన గొల్లకల్యాణ్, కొత్తపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తూ ఢీకొన్నారు. ఈ సంఘటనలో లక్ష్మణ్‌రావు తలకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య సహజ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కువైట్‌లో ముస్తాబాద్‌వాసి మృతి



వేదుల్(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎండీ వేదుల్(36) కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. వేదుల్ నాలుగు నెలలక్రితం ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితివిషమించి మృతి చెందాడు. వేదుల్‌కు భార్య షబానా, ఇద్దరు పిల్లలున్నారు. పేదకుటుంబానికి చెందిన వేదుల్ మృతదేహం స్వగ్రామం చేరేలా చూడాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ఎండపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లకోట గ్రామంలో గురువారం రోజున కుక్కలదాడిలో 12మేకలు మృతిచెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమరగొండ దివాకర్ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మేపడానికి వెళ్లాడు. అనా రోగ్యంతో నడవలేని కొన్ని మేకలను గూటిలో వేసి మిగతా వాటితో వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా కుక్కలుమేకలపై దాడిచేసి చంపాయి. వాటివిలువ సుమారు లక్షపైగా ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని దివాకర్ వేడుకుంటున్నాడు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు గంగాధర విద్యార్థి


అస్లాం

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రభుత్వ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి అస్లాం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అండర్ 14 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా పాఠశాలకు చెందిన అస్లాం అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయినట్లు పీడీ తెలిపారు. ఈ నెల 5 నుండి 7 వరకు భద్రాది కొత్తగూడెం జిల్లా హస్నాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, ఎంపీడీవో రాము, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


ఈర్ల శ్రీజ

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థి ఈర్ల శ్రీజ అండర్ 19 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విద్యార్థి శ్రీజ ప్రాతినిధ్యం వహిస్తోంది. శ్రీజను ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

కొండగట్టులో గిరి ప్రదక్షిణ


మల్యాల, డిశంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరుల చుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ గురువారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానార్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిప్రదక్షిణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప దీక్షాపరులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం


శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. చినజీయర్‌స్వామి శిష్య బృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంతకౌశిక్, వివేక్ స్వామిలే వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యతో పాటు భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలు కఠినం



పాటించకపోతే పదవీ గండం

మూడేళ్ల పాటు పోటీలకు దూరం

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నియమ నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అభ్యర్థులు తెలిసి తెలియక వాటిని ఉల్లంఘిస్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా అభ్యర్థులు తమ ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసిన రోజు నుంచి పక్కగా లెక్కలు పరిగణనలోకి వస్తాయి. రూపాయి రూపాయి లెక్క చేస్తారు. ఎవరు చూస్తున్నారంటూ నిర్లక్ష్యం చేస్తే గెలిచాక పదవి ఊడిపోతుంది. దీంతో పాటు మరో మూడేళ్ల పాటు ఏ ఎన్నికలలో పోటీ చేయకుండా అనర్హత విధిస్తారు. అందుకని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేసే ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి తప్పకుండా తెలుపాలి.

అయితే ఎన్నికలకు సంబంధించిన ఖర్చులన్నీంటినీ కొత్త బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన లావాదేవీ లన్నింటినీ ఆ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాలి. ప్రతీ అభ్యర్థి తన గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఎన్నికలు ముగిసిన 45 రోజుల లో తనకు సంబంధించిన ఎన్నికల ఖర్చు వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి.

ఒకవేళ గెలిచిన అభ్యర్థులు ఆ సంబరంలో సకాలంలో ఖర్చు వివరాలను అధికారులకు ఇవ్వడం మరిచిపోతే పదవి కోల్పోవడంతో పాటు మూడేళ్ల అనర్హత వేటు పడుతుంది.

మర్చిపోకుండా ఎన్నికల ఖర్చు వివరాలను గెలుపు ఓట ములతో సంబంధం లేకుండా నిర్ణీత గడువులోగా అధికారులకు సమర్పించాలి. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్న అన్ని ఖర్చులను ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన నిఘా బృందాలు గమనిస్తూ ఖర్చును అంచనా వేస్తుంటాయి. నిఘా బృందాలు రికార్డు చేసిన ఖర్చు మొత్తాన్ని కూడా అభ్యర్థుల పేరుతో నమోదు చేస్తాయి. సాధ్యమనంత వరకు ఎన్నికల వ్యయ పరిమితికి లోబడి మాత్రమే ఖర్చులు చేస్తూ వాటిని నమోదు చేసుకోవాలి.

అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు వివరాలు

సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి గ్రామ జనాభా 5 వేల లోపు ఉంటే లక్షా 50 వేల రూపాయలు, వార్డు స భ్యుడికి పోటీ చేసే అభ్యర్థి 30 వేలు, 5 వేల జనాభా దాటితే 2.50 లక్షల రూపాయలు, వార్డు సభ్యుడు అభ్య ర్థి 50 వేల రూపాయ లకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల గెలుపు కోసం రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చును అభ్యర్థుల ఖాతా ల్లోనే జమ చేస్తారు.

అభ్యర్థుల ఖర్చుపై ఎప్పటికప్పుడు సర్వైవల్ టీమ్స్, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియోలు, ఫొటోల చిత్రీకరణ చేసి ఖర్చును లెక్కిస్తారు. అభ్యర్థులు చేసిన ఖర్చుకు సంబంధించి తక్కువ చేసి లెక్క లు సమర్పించినప్పుడు వీడియోలు, ఫొటోలను పరిశీలించి సరి చేస్తారు. ఎన్నికల కోసం వాడే ప్రచార సామగ్రి, తదితర వాటికి ఎన్నికల సం ఘం ధరలు నిర్ణయించింది. ఆ ధరల ప్రకారమే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చూపాల్సి ఉంటుంది. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యాడ్జీలు, వాల్ రైటింగ్స్, నమూనా బ్యాలెట్లు, తదితర ముద్రించి ఓటర్లకు పంపిణీ చేస్తారు. ప్రచారానికి మైకులు, లౌడ్ స్పీకర్లు వినియోగిస్తుంటారు. వీటన్నింటికీ ఎన్నికల సంఘం ధరలు నిర్ణయించింది.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 6,892 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అడ్మిట్ కార్డులో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 6లోగా చొప్పదండిలోని నవోదయ విద్యాలయంలో సరిచేయించుకోవాలన్నారు. మార్పులు ఏవైనా ఉనట్లయితే సంబంధిత ఆధార పత్రాలు తీసుకొని విద్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి చేస్తుందని, భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యమని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో ఉత్తరాఖండ్‌లో సంఘం 71వ జాతీయ మహాసభలు నిర్వహించినట్లు చెప్పారు. ఏబీవీపీ ఉద్యమాలు, విజయాలు, రావాల్సిన మార్పులపై చర్చించామన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి చిప్ప యోగేష్, వంశీ,శివ , ఆకాష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పది సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలు, బడా పెట్టుబడుదారులైన అంబానీ, ఆదానీలు వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని, కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దాసోహమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మూడవ ఆర్థిక దేశంగా భారతదేశం రూపొందుతోందని ప్రధానమంత్రి అబద్ధాలు చెపుతున్నాడని అన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. బ్యాంకులను ప్రైవేటుపరం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై జ్యూడీషియల్ ఎక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పచ్చని కొబ్బరిచేలను చూసి తెలంగాణ వారి కళ్లు మండుతున్నాయనడం ఆయన అహంకార పూరిత వ్యాఖ్యలకు నిదర్శనమన్నారు. సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాలు పచ్చని పొలాలతో విలసిల్లుతున్నాయన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారినే ఎన్నుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 73, 74 రాజ్యాంగ సవరణ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారి పరిస్థితి ఏమిటన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జనవరి 7న శబరిమలకు ప్రత్యేక రైలు

పెద్దపల్లి, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలకు జనవరి 7వ తేదీన మరో ప్రత్యేక రైలు నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నంబర్ 07133 నాందేడ్ నుంచి ఉదయం 4:25 గంటలకు బయలుదేరుతుంది.. కోరుట్లకు 8:30 గంటలకు, జగిత్యాలకు 9 గంటలకు, కరీంనగర్‌కు 10 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 10:50 గంటలకు చేరుకోనున్నది. ఇక్కడి నుంచి 11:40 గంటలకు బయలు దేరి జమ్మికుంట 12:20, వరంగల్‌కు మధ్యాహ్నం 1:18 గంటలకు, తిరుపతికి రాత్రి 1:20 గంట లకు, కొల్లాం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07134 కొల్లాం నుంచి ఉదయం 2:30 గంటలకు బయలు దేరి, నాందేడ్‌కు మరుసటి రోజు సాయంత్రం 5:30 గంటలకు చేరుకోనున్నది.

అరటి సాగుపై రైతులు దృష్టిసారించాలి


అరటి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారులు

జగిత్యాలరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ వరి పంటనే కాకుండా అధిక ఆదాయాన్ని అందించే అరటి సాగుపై దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జి. శ్యాం ప్రసాద్ రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో పండిస్తున్న అరటి తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి మొక్కలు నాటుకోవడానికి అనువైన సమయమని అన్నారు. టిష్యూకల్చర్ అరటి మొక్కలు తెచ్చి నాటుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. బిందు సేద్యం ద్వారా నీరు అందిస్తే కలుపు సమస్య తక్కువగా ఉండి అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ ఉద్యాన అధికారి కె. స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ ఉన్నారు.

వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి సీఎం అన్యాయం


మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించి మాల సామాజిక వర్గానికి రిజర్వేషన్లు లేకుండా గొంతు కోశాడని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం అంబేద్క ర్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మాల సామాజిక వర్గానికి చెందిన 26 కులాలను రిజర్వేషన్లు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో వేయి పోస్టులకు మాల సామాజిక వర్గానికి 28 పోస్టులు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు చేస్తుంటే కాంగ్రెస్‌లో ఉన్న మాల సామాజిక వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కళ్లు మూసుకున్నారన్నారు. మాల సామాజిక వర్గం సత్తా చాటకపోతే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి పాటించి ఉండే మాల సామాజిక వర్గానికి ఏడు శాతం రిజర్వేషన్లు వచ్చేవని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుకు రామ్‌చందర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్, కో కన్వీనర్ జక్కుల యాదగిరి, స్టూడెం ట్ జేఏసీ చైర్మన్ మాదాసి రాహుల్, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్, జిల్లా నాయకులు బూర యాదగిరి, బొల్లం గణేష్, పాటి రాజ్‌కుమార్ ఉన్నారు.

ధాన్యంలో కోతపై రైతుల ఆందోళన

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో రాయపట్నం రహదారిపై కాట్నపల్లికి చెందిన పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో కోత విధించారని రైస్ మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. ధాన్యం నాణ్యంగా ఉన్నప్పటికీ 42 కిలోల బస్తా తూకం వేసి పంపినప్పటికీ అదనంగా మరో కిలో కోత విధించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు రైతులతో మాట్లాడగా శాంతించారు.

డిపో మేనేజర్లతో సమావేశం

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో గురువారం రీజినల్ మేనేజర్ బి రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబరు మాసాంతం వరకు అన్ని డిపోల పనితీరు, పరమాదాలు నివారణ చర్యలు, రానున్న మేడారం జాతర ఏర్పాట్లు, శబరిమలై ప్యాకేజీ టూర్లు, యాత్రాదానంకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


ఎయిర్‌పోర్ట్ అథారిటి అధికారులతో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

జ్యోతినగర్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల కేంద్రంలోని ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటు స్థల పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు బానోతు శ్రీనివాస్ తదితర బృంద సభ్యులను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ కలిశారు. ఎన్టీపీసీ జ్యోతిభవన్‌లో ఎమ్మెల్యే వారిని కలిసి చర్చించారు. ప్రతిపాదిత 977 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించగా, గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో సమీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ఫిజిబిలిటి రిపోర్టు తయారు చేస్తున్నామని, అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ జిల్లా ప్రాంత ప్రజలకు, పారిశ్రామిక ప్రాంతాల్లోని అధికారులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు విషయంలో చురుగ్గా ఉందని,పెద్దఎత్తున ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



అలంకరణకు ముందు వరదవెల్లి దత్తాత్రేయ స్వామి, వ్రతంలో పాల్గొన్న భక్తులు


ధర్మపురిలో దత్తాత్రేయ స్వామి

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గత నెల 27 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు. అనంతరం ఆలయ వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ధర్మపురి గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయంలో..

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. స్వామివారి దర్శనం కోసం గుట్టపైకి వెళ్లేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐదు బోట్లను ఏర్పాటు చేశారు. పౌర్ణమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. అనంతరం గుట్ట కింద సామూహిక సత్య దత్త వ్రతాలను నిర్వహించారు. గురుపూజ, హారతి, రాత్రి దత్తాత్రేయస్వామి డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు


స్థల పరిశీలన చేస్తున్న బానోతు శ్రీనివాస్

పాలకుర్తి/అంతర్గాం డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు స్థలాన్ని గురువారం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సర్వే చేశారు. కమ్యూనికేషన్స్, నావిగేషన్స్, సర్వేలైన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బానోతు శ్రీనివాస్, ఇతర అధికారులు హాజరయ్యారు. 977 ఎకరాల స్థలంలో ఏర్పాటుకు మ్యాప్‌ను అధికారులు పరిశీలించారు. అనంతరం గోలివాడ, ముర్మూరు పంపుహౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్ట్, స్పిన్నింగ్ మిల్లు, రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్థలం అనుకూలంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ తూము రవిందర్ పటేల్, సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జనవరి 28 నుంచి

సమ్మక్క-సారలమ్మ జాతర

ఉమ్మడి జిల్లాలో 60కి పైగా ప్రదేశాల్లో ఏర్పాట్లు


పెద్దపల్లి జిల్లా గోయల్‌వాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి 28 నుంచి నిర్వహించనున్న సమక్కసారలమ్మ జాతర, అధికారుల వివరాలు, శాఖాపరమైన సూచనలను ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 60కి పైగా, అందులో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 31 చోట్ల జాతర కొనసాగనుంది. ఆయా జాతరల నిర్వాహకులు, అధికారులు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జాతర అధికారులు వీరే...

- కరీంనగర్ జిల్లాలో..

హుజూరాబాద్, వావిలాలకు కె.సుధాకర్, జూపాక (హుజూరాబాద్)కు కె.సుభద్ర, ఇల్లందకుంట (మల్యాల), తనుగుల (జమ్మికుంట)కు కె.మోహన్, రేకుర్తి (కొత్తపల్లి)కి ఎ.మారుతి, చింతకుంట (కొత్తపల్లి), కొండపల్కల (మానకొండూరు), కొత్తపల్లి (తిమ్మాపూర్)కు ఎన్.అనిల్‌కుమార్, కేశవపట్నం (శంకరపట్నం), సైదాపూర్‌కు డీవీ మారుతీరావు, వీణవంక, కేశవాపూర్ (జమ్మికుంట), చల్లూరు, కోరుకల్ (వీణవంక)కు జి.రాజయ్య.

- జగిత్యాల జిల్లా : ధర్మపురికి డి.కిరణ్
- పెద్దపల్లి జిల్లాలో...

కొలనూరు, మడక (ఓదెల), కొదురుపాక, తొగర్రాయి (సుల్తానాబాద్), మీర్జంపేట, పెగడపల్లి (కాల్వశ్రీరాంపూర్), హన్మంతుని పేట (పెద్దపల్లి)కి బి సదయ్య, నీరుకుళ్ళ, గర్రెపల్లి (సుల్తానాబాద్), ఎలిగేడు, తెలుకుంట్ల (జూలపల్లి)కి ఎం.శంకరయ్య , గోదావరిఖని, ఈసలతక్కళ్ళపల్లి (రామగుండం), గుండారం (కమాన్‌పూర్)కు కె.కాంతారెడ్డి, గోయల్‌వాడ (రామగుండం)కు కె.రాజ్‌కుమార్.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు

- నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్



భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టాం. అన్ని శాఖలు, జాతర కమిటీలు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలి.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ



విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

ఇల్లంతకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాచారం గ్రామ ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులకు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు హౌస్‌డ్రెసెస్, షూలను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఐఏఆర్‌ఈ కళాశాల ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో రూ.57వేల విలువైన వస్తువులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి రాణి, అధ్యక్షుడు ఆదిత్య, అసోసియేట్ అధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చారీతార్థ, అఖిల్, ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్‌రెడ్డి, శ్రీను, ఆనంద్, దావీద్, శ్రీనివాస్, సురేష్, సంజీవ్, శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



యూనిఫామ్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాధా

చందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని చందుర్తి ఎంపీడీవో రాధ అన్నారు. చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఆదిలక్ష్మి ఉపాధ్యాయులు సరస్వతి, సీఆర్పీ వినయ్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోటీదారులకు కొత్త ఖాతా కష్టాలు..!



ఖాతా కోసం తపాలా కేంద్రం వద్ద నిలబడిన పోటీదారులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు కొత్త బ్యాంకు, తపాల ఖాతా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన విధించింది. దాంతో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు నూతన ఖాతాల కోసం బ్యాంకులు, తపాలా కేంద్ర కార్యాలయాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. బ్యాంకులు, తపాలా కేంద్రం వద్ద దరఖాస్తులు నింపుతూ బారులు తీరుతున్నారు. కొందరు తెలియక స్థానిక బ్యాంకుల్లో ఖాతాలు తీసి నామినేషన్ కేంద్రాల వద్దకు వెళితే ఆ బ్యాంకు ఖాతాను పరిగణనలోకి తీసుకోమని పేర్కొంటుండడంతో ఇతర బ్యాంకులు, తపాలా కేంద్రాలకు చేరుకుంటున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

ఇల్లంతకుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు. మండలంలోని దాచారం, బోటిమీదిపల్లె, సిరికొండ, అనంతగిరి, వెంకట్రావుపల్లె తదితర గ్రామాలలో గురువారం సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. డబ్బులకు, మద్యానికి ఆశపడి ఓటువేయద్దన్నారు. గ్రామాన్ని ఎవరు అభివృద్ధి చేస్తారో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కట్టడంపై అనుమానాలు

వేములవాడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డులో ఉన్నఫలంగా ఒక షెడ్డు వెలిసింది. అక్రమంగా నిర్మించారనే అనుమానాలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ ఏఈ అభినవ్‌ను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత..



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న నిర్వాహకులు

తంగళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం మతిస్థిమితం లేని వృద్ధురాలు జిల్లా కేంద్రంలో బస్టాండ్‌లో తిరుగుతుండగా గుర్తించి మండలం మండేపల్లి శివారులోని ప్రభుత్వ వృద్ధాశ్రమానికి సంబంధిత అధికారులు తరలించారు. వారం రోజుల పాటు మానసిక వైద్యుడి వద్ద వైద్యం చేయించారు. దీంతో వృద్ధురాలకి గతం గుర్తుకు వచ్చి తన పేరు గడ్డం లక్ష్మి, కామారెడ్డి జిల్లా నర్సిలాబాద్ మండల కేంద్రం అని తెలిపింది. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ఆదేశాల మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం ఆశ్రమంలోని వృద్ధురాలిని కుటుంబ సభ్యులు గడ్డం చిన్న సాయిలు, రాములకు వృద్ధాశ్రమం నిర్వాహకులు అప్పగించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయ శిఖరం, కలశం, ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన వారికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు హన్మండ్లు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. దంపతులు భక్తిశ్రద్ధల నడుమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

చందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే చందుర్తి మండలానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు రెండు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ రాధా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8 తేదీలలో చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్(పీబీ) సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు అందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఎస్పీ



ముస్తాబాద్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి గీతే



గాలిపల్లి గ్రామంలోని కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మహేశ్ బి గీతే సూచించారు. ముస్తాబాద్, పోతుగల్ నామినేషన్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. అలాగే వెంకట్రావుపల్లె చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే గ్రామపంచాయతీలకు వార్డులకు మూడో విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో 24 గంటలు చెక్‌పోస్టు వద్ద పర్యవేక్షణ కొనసాగిస్తూ అక్రమ మద్యం, డబ్బు రవాణాను అరికట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎవరు ఉల్లంఘించిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 158 కేసుల్లో 657 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట సీఐ మొగిలి, ఎస్సై గణేశ్‌లున్నారు.

●ఎల్లారెడ్డిపేట : ఎన్నికల నిబంధనల మేరకు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావియ్యకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎస్పీ మహేష్.బి గితే అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలతో పాటు పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. బందోబస్తు విధులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకు తనిఖీలను ముమ్మరం చేశామని అన్నారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని ఎస్పీ మహేష్ బిగితే అన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలంలోని జిల్లా సరిహద్దులోని పెద్దమ్మ చెక్‌పోస్ట్‌ను గురువారం ఎస్పీ మహేష్ బి గీతే తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల క్రమంలో చెక్‌పోస్ట్‌ల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం తరలిస్తే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం సీజ్ చేయాలన్నారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌వో కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ

ఇల్లంతకుంట డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలోని ఆర్‌వో కేంద్రాలను అదనపు ఎస్పీ చంద్రయ్య పరిశీలించారు. ఇల్లంతకుంట, వంతడుపుల, గాలిపెల్లి, పొత్తూరు గ్రామాల్లోని కేంద్రాలను సందర్శించి ఆర్‌ఓల ద్వారా వివరాలను సేకరించారు. నామినేషన్ విత్‌డ్రాల సందర్భంగా అవసరం అయిన మేరకు పోలీస్ రక్షణ కల్పిస్తామన్నారు. కేంద్రాల వద్ద ఎవైన సంఘటనలు జరిగితే వెంటనే సమాచారం అందివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఫసియొద్దీన్, రాజేందర్, సురేష్ తదితరులు ఉన్నారు.

నెలరోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

- రైతన్నల్లో ఆందోళన



కొనుగోలు కేంద్రంలో నెలరోజులుగా ఉన్న ధాన్యం కుప్పలు

వేములవాడ, డిసెంబబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, ప్రకృతి వైపరిత్యాలను దాటుకుని, కష్టపడి పండించిన పంట చేతికి వచ్చినప్పటికీ విక్రయించేందుకు మాత్రం రైతులన్నలకు కన్నీటి దుఃఖం తప్పడం లేదు. వేములవాడ పట్టణంలోని నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తిప్పాపూర్ గ్రామంలో రైతులు గత నెల రోజులగా కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతన్నలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు సూచించిన క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుంది. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు వెక్కిరిస్తున్నాయి.

లారీల కొరతతో కొనుగోళ్లు ఆలస్యం..

వేములవాడ పట్టణం, మండలంతో పాటుగా ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. రైతులు పండించిన పంటను పెద్ద మొత్తంలో కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ఆరబెట్టారు. గతనెల రోజులగా లారీల కొరత ఉంద, ధాన్యం తూకం వేయడం లేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. రబీసాగుకు సన్నద్ధం కావాల్సిన సమయం వచ్చినప్పటికి పండించిన ధాన్యం మాత్రం కొనుగోలు కాలేదని రైతులు నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉద్యోగులను నిలదీస్తే లారీలు దొరకడం లేదని, లారీల కొరతతోనే ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యమవుతుందని సమాదానం ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రబీ సీజన్‌కు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని, ఇంత వరకు నారుమడ్లు సిద్దం చేయాల్సి ఉండేదని, సేకరించిన ధాన్యం విక్రయించకపోవడంతో నిత్యం ధాన్యం వద్ద పడిగాపులు కాయల్సివస్తుందని రైతన్నలు వాపోతున్నారు.

రైతుల గుండెల్లో గుబులు..

ఎంతో కష్టానికి ఓర్చి చేతికి వచ్చిన పంట కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గడంతో రైతులు తీవ్ర అసహానికి గురువుతున్నారు. మూడు రోజులుగా వాతావరణంలో మార్పుల వల్ల వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని గుబులు చెందుతున్నారు. ప్రతి నిత్యం ధాన్యం ఆరబోస్తున్నామని రాత్రి వేళల్లో మంచుకు తేమ శాతం తగ్గుతుందని చెబుతున్నారు. తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురువుతన్నారు. త్వరితగతిని ధాన్యం కొనుగోలు చేయాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

లారీల కొరత ఉందని చెబుతున్నారు..

- రూపేందర్, యువ రైతు తిప్పాపూర్



నాకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాను. ధాన్యం సేకరించి కొనుగోలు కేంద్రాలకు తీసకువచ్చి నెల రోజులు అవుతోంది. తేమ శాతం పరీక్షించగా కొనుగోలు చేసేందుకు అనువుగా ఉందని సిబ్బంది చెప్పారు. తూకం మాత్రం పెట్టడంలేదు. సిబ్బందిని అడిగితే లారీల కొరత ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి.

ఆమెదే తీర్పు..

(5వ పేజీ తరువాయి)

63 జనరల్ స్థానాలుగా కేటాయించారు. 2268 వార్డుల్లో వందశాతం ఎస్టీ పంచాయతీల్లో 176 వార్డులు ఉండగా, 88 మహిళకు, 88 జనరల్, ఇతర 53 ఎస్టీ వార్డుల్లో 18 మహిళలకు, 35 జనరల్‌గా కేటాయించారు. 442 ఎస్సీ వార్డులలో 177 మహిళకు, 26 జనరల్‌గా ఉన్నాయి. 553 బీసీ వార్డుల్లో 222 మహిళకు, 331జనరల్ స్థానాలుగా ఉన్నాయి. 1044 జనరల్ వార్డుల్లో 471 మహిళలకు, 573 జనరల్‌గా ఉన్నాయి. రిజర్వేషన్లు కలిసి రాకపోవడంతో మహిళా రిజర్వ్ స్థానాల్లో భార్య, కోడలు, కూతుర్లను బరిలో నిలిపారు. జిల్లాలో కొన్నిచోట్ల కుటుంబ సభ్యులే పోటీపడుతున్న తీరు ఉంది.

ఊపందుకున్న నామినేషన్లు..!

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో తుది విడతలో నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 43 పంచాయతీలు.. 358 వార్డులుండగా.. రెండోరోజు గురువారం నామినేషన్ల పర్వం ఊపందుకుంది. రెండు మండలాల్లో సర్పంచులకు 80, వార్డులకు 232 నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీవోలు సత్తయ్య, శ్రీలేఖలు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో 26 పంచాయతీలకు సర్పంచ్‌లకు 47, 226 వార్డులకు 191, వీర్నపల్లిలో 17 పంచాయతీలకు సర్పంచ్‌లకు 33, 132 వార్డులకు 41 నామినేషన్లు దాఖలయ్యాయి. వీర్నపల్లి మండలంలోని జవహర్‌లాల్‌నాయక్‌తండాలో రెండో రోజూ సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మొదటి రోజు కంటే రెండో రోజు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడంలో ఉత్సాహం చూపారు. శుక్రవారం నామినేషన్లు సమర్పించడానికి చివరి రోజు కావడంతో ఇప్పటివరకు దాఖలు చేయని అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించే అవకాశం ఉంటుంది. బొప్పాపూర్, గొల్లపల్లి కేంద్రాలను జిల్లా ఎన్ని కల పరిశీలకులు రవికుమార్, వెంకటాపూర్, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ మహేష్. బి.గితేలు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

86వార్డులకు సింగిల్ నామినేషన్లు

ఇల్లంతకుంట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 294 వార్డుస్థానాల్లో 86 స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. అనధికారికంగా వీరు ఏకగ్రీవం కావడంతో ఆయా వార్డుల్లో సంబరాలు జరుపుకున్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

కథలాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. గురుపౌర్ణమి పురస్కరించుకుని స్వామివారి సన్నిధికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలింత నామినేషన్..



నామినేషన్ వేసేందుకు పసికందుతో వస్తున్న సౌందర్య

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ బాలింత పది రోజుల పసికందుతో వచ్చి సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసింది. వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామ సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో పది రోజుల క్రితం డెలివరీ అయిన జాలపల్లి సౌందర్యతో ఆమె భర్త మనోజ్‌కుమార్ గురువారం రంగంపేటలోని కేంద్రంలో నామినేషన్ వేయించాడు.

● ఉదయం అస్వస్థత.. మధ్యాహ్నం నామినేషన్..

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పల్లెల్లో జోరందుకుంది. ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాంగ్రెస్ మద్దతుదారుడు కనకరాజుకు బీపీ తక్కువ కావడంతో గురువారం ఉదయం ఇంట్లో స్పృహ తప్పి పడిపోయాడు. దాంతో కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. కోలుకున్న కనకరాజు మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.

● కూతురి ఆశీస్సులు తీసుకొని..

ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ సర్పంచ్ స్థానానికి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ మద్దతుదారుడు లింగాల నరేందర్ గురువారం నామినేషన్ దాఖలు చేసేందుకు తన ఆరు నెలల కూతురు హేయాన్సీ ఆశీస్సులు తీసుకొని బయలుదేరి వెళ్లారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.

'పల్లె పోరు'తో కుటుంబాల్లో కుంపట్లు

- వార్డుల్లో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య పోటీ..

చందుర్తి డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలంలో మొదటి విడతలో వేసిన నామినేషన్లలో ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. కొన్ని గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ముగ్గురు నామినేషన్ల వేస్తూ పరాయి వ్యక్తుల్లా, పోటీదారుల్లా మారుతున్నారు. అన్నదమ్ములు.. అక్క చెల్లెలు, తండ్రీ కొడుకులు.. బావబామ్మర్దులు.. ఇలా చాలా మంది పోటీ చేస్తున్నారు. ముందు నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నవారే కాకుండా హఠాత్తుగా కొత్తవారు పోటీలో నిలబడ్డారు.

పోటాపోటీగా నామినేషన్లు..

మండలంలోని కట్ట లింగంపేట గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు దశరథం, నరేష్‌లు గ్రామంలోని ఐదో వార్డులో, కిష్టంపేట గ్రామంలో ఆరవ వార్డులో మంజుల, మానస వార్డు ఒకే స్థానానికి పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. చందుర్తి మండల కేంద్రంలో ఐదు వార్డుల్లో ఐదుగురు భార్యాభర్తలు వేర్వేరు వార్డుల్లో పోటీ చేస్తున్నారు. మల్యాలలో కోడలు సర్పంచ్ పదవి పోటీ చేస్తుండగా, అత్త వార్డు సభ్యురాలుగా పోటీ చేస్తోంది. అక్క సర్పంచ్‌గా, చెల్లెలు వార్డు సభ్యులు పోటీ చేస్తుండగా, రెండు వార్డుల్లో భార్యాభర్తలు పోటీ చేస్తున్నారు. మర్రిగడ్డలో ఇద్దరు భార్యాభర్తలు వార్డు సభ్యులుగా నామినేషన్ వేయగా భార్యలు ఏకగ్రీవం కాగా, భర్తలు ఇద్దరు పోటీలో నిలిచారు. నర్సింగాపూర్ గ్రామంలో తల్లి, కొడుకులు వేర్వేరు వార్డుల్లో పోటీ చేస్తుండగా, భార్యభర్తలు వేర్వేరు వార్డుల్లో పోటీపడుతున్నారు. ఆశిరెడ్డిపల్లి, రామారావుపల్లి గ్రామాల్లో బావబామ్మర్దులు ఒకే వార్డుల్లో పోటీ చేస్తున్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో ప్రాణస్నేహితులుగా ఉన్న చాలా మంది ఇప్పుడు ప్రత్యర్థులుగా మారిపోయారు. ఇలా పంచాయతీ ఎన్నికలు కుటుంబాలు, బంధువుల మధ్య విరోధాలు ఏర్పడుతున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో వారిని బుజ్జగించేందుకు కుటుంబ పెద్దలు ప్రయత్నాలు చేసిన, కానీ ఇలాంటి అవకాశం మళ్లీ రాదంటూ అభ్యర్థులు పోటీకే మొగ్గు చూపినట్లు తెలిసింది. అయితే ఒకరికి మద్దతు ఇస్తే మద్దతు ఇస్తే మరొకరితో విభేదాలు వస్తాయని, దీంతో ఎవరి వైపు ఉండాలో తెలియక బంధువులు తలలు పట్టు కుంటున్నారు.

నిబంధనలను పాటించకుంటే రిజిస్ట్రేషన్స్ రద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుంటే ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్స్ రద్దు చేస్తాం అని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌వో సిబ్బందితో కలిసి తనిఖీలను చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రిసెప్షన్ కౌంటర్ వద్ద ధరల పట్టిక వివారాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, వైద్యులు, సిబ్బంది వివరాలు పెట్టకపోవడంపై ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యాధిగ్రస్తులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డయాగ్నస్టిక్ కేంద్రాలు, ల్యాబ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆసుపత్రుల రికార్డులు, సరైన మెడికల్ రిపోర్టులు క్రమంగా ఉంచాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల యజమానులు, వైద్యులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఆసుపత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వెంట వైద్యులు రామకృష్ణ, మహేష్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



హర్షవర్ధన్

ఇల్లంతకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంత కుంట మండలం గాలిపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతున్న బుర్ర హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. గతనెలలో గాలిపల్లిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో శుక్రవారం నుంచి జరగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు. ప్రధానోపాధ్యాయురాలు మేకల పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు బట్టు పద్మలతో పాటు ఈతరం యువజన సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

క్రీడాభివృద్ధిలో రాష్ట్రం ముందంజ

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి



క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో క్రీడాభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం ముగింపు సమావేశం గురువారం జరిగింది.చైర్‌పర్సన్ స్వరూపతిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల కు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో విజ యం సాధించేందుకు బాలుర జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సింగారం తిరుపతి, ఉపాధ్యక్షుడు బొడ్డు రాములు, ఉపాధ్యక్షుడు దేవత ప్రభాకర్, సహాయకార్యదర్శి ముస్తాఫా, సిరిసిల్ల మండల అధ్యక్షుడు బొడ్డు నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెల్ముల తిరుపతిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రూటు మార్చిన సర్పంచ్ ఆశావహులు

- రిజర్వేషన్‌లు కలిసిరాక వార్డు సభ్యులుగా పోటీ

వేములవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఆశావాహులు రిజర్వేషన్ల మార్పుతో రూటు మార్చారు. సర్పంచ్‌గా పోటీ చేయాలని వేచి చూసిన అభ్యర్థులకు రిజర్వేషన్‌లు తారుమారు కావడంతో వార్డు సభ్యుడిగా పోటీచేసి ఉపసర్పంచ్ సీటు కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. గ్రామంలో తమకు అనుకూలంగా ఉన్న వార్డుల్లో పోటీ చేసి చెక్‌పవరున్న ఉపసర్పంచ్ పదవి కైవసం చేసుకునేందుకు బరిలోకి దిగుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మహిళ రిజర్వేషన్‌లు ఉన్న చోట ఉపసర్పంచ్ పదవి దక్కించుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా మిగతా వార్డుల్లో గెలుపొందే వార్డు సభ్యులను మచ్చిక చేసుకునేందుకు యత్నాలు మొదలుపెట్టారు. ఉపసర్పంచ్‌గా బరీలో నిలిచే అభ్యర్థులు గెలుపు అవకాశాలున్న వార్డు అభ్యర్థులకు పెద్దమొత్తంలో నజరానాలు ఆఫర్ చేస్తున్నట్లు స్థానికంగా జోరుగా ప్రచారం జరుగుతోంది.